క్లుప్తంగా

పరామర్శ



గంగులమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : సర్పంచ్ గంగులమ్మ భర్త రవణప్ప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం సర్పంచ్ గంగులమ్మ స్వగృహానికి చేరుకొని, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢసానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల శివానంద రెడ్డి, నీళ్ల భాస్కర్, కేశవ రెడ్డి, రఘు, రవి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

కలకడ : దోమల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దోమలు వృద్ధిని నివారించేందుకు మురుగు కాల్వల్లో, కుంటల్లో గంబూసియా చేపపిల్లలు వదులుతున్నట్లు డాక్టర్ జవహర్‌బాబు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ముజీబ్‌బాషా తెలిపారు. బుధవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని పాపిరెడ్డిగారిపల్లె, కదిరాయచెర్వు గ్రామాలలో పర్యటించారు. సీజనల్ వ్యాధులు, విషజ్వరాలపై గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని కోరారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, ఎంపీహెచ్ఎస్ వెంకటేశ్వరరావు, షరీఫ్‌బాషా, జమీల్‌అహమ్మద్, వాణి, గురుశాంత, రమణమ్మ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పీలేరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సతీష్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో శాఖల వారీగా మండలంలో జరిగిన ప్రగతిని చదివి వినిపిస్తారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

జాంబవంతుడికి పూజలు



ప్రత్యేక అలంకారంలో జాంబవంతుడు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మనగర్‌లో వెలసివున్న జాంబవంతుడి ఆలయంలో బుధవారం స్థానికుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులందరూ భక్తిశ్రద్ధలతో జాంబవంతుడికి అభిషేకాలు, అర్చనలు చేసి పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

రామాపురం : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఎస్ఐ వి.లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె బ్రిడ్జి వద్ద వంకలో మంగళవారం ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో తన సిబ్బందితో కలిసి వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

విజయవంతమైన జాబ్ మేళా

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో జరిగిన మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళా బుధవారం విజయవంతమైంది. జాబ్ మేళాలో 70 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో మొదటి, రెండో రౌండ్ పూర్తి చేసుకొని మూడో రౌండ్‌కు 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు కంపెనీ నియామక పత్రాలు అందజేశారు.

అన్నదానం

రామాపురం : మండలంలోని బండపల్లి పంచాయతీలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో బుధవారం గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ నక్కలవాండ్లపల్లెకు చెందిన ఎస్.వీరాంజనేయులు, మల్లికార్జున తమ తల్లి పార్వతమ్మ 3వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వృద్ధులకు అన్నదానం చేసే అవకాశాన్ని లయన్స్ క్లబ్ శివారెడ్డి, జోనల్ చైర్మన్ మహమ్మద్‌లు కల్పించారని, తమ కుటుంబంలో ఎలాంటి వేడుకలు జరుపుకున్న సమాజానికి ఉపయోగపడేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

పదిలో మెరిసి... ట్రిపుల్ ఐటీతో మురిసి..!

ఉత్తమ ఫలితాలు సాధించాలన్న విద్యార్థుల సంకల్పం.. ఉపాధ్యాయుల అంకితభావంతో పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అదరగొట్టారు. ముందస్తు ప్రణాళికతలో కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా మెరిసి.. ట్రిపుల్ ఐటీలోనూ సత్తా చాటారు. ప్రభుత్వం స్కూళ్లంటే చిన్న చూపొద్దు అనేలా అందరికీ చాటి చెప్పారు.

- నేతన్న బిడ్డలు... చదువులో దిట్టలు
- ట్రిపుల్ ఐటీకి ఎన్నికైన 11 మంది విద్యా కుసుమాలు
- ఆదర్శంగా వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

మదనపల్లె సిటీ : మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని రాంరెడ్డి లేవుట్ వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రతిభకు నిలయంగా మారింది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చక్కని ప్రతిభ చూపుతున్నారు. పది ఫలితాల్లో కాకుండా ట్రిపుల్ ఐటీలోనూ సత్తా చాటుతున్నారు. కార్పొరేట్‌కు ధీటుగా ఫలితాలు సాధిస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఈ ఏడాది ఇదే పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఇడుపులపాయ (ఆర్‌కె వ్యాలీ), శ్రీకాకుళం, నూజివీడు ట్రిపుల్ ఐటీల్లో వారికి సీటు కేటాయించారు.

సంవత్సరం	ఎంపికైన విద్యార్థుల సంఖ్య
2024	11
2023	18
2022	14
2021	12



వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..



మాది చేనేత కుటుంబం. పాఠశాలలో చేరినప్పటి నుంచి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నన్ను ఎంతో ప్రోత్సహించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందినందుకు ఆనందంగా ఉంది. ఈ విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటా. - బి.దీక్షిత

అదృష్టంగా భావిస్తున్నా



మాది చేనేత కుటుంబం. హెచ్ఎం రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహం మరిచిపోలేను. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ప్రత్యేకంగా పుస్తకం తయారు చేసుకునేవాడిని. ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందటం నా అదృష్టంగా భావిస్తున్నా. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని ఉంది. - బి.హేమమాలిని

నిరంతర సాధనతోనే ఫలితాలు



నిరంతర సాధనతోనే మంచి ఫలితాలు సాధించవచ్చు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు నోటు పుస్తకంలో రాసుకుని క్రమపద్ధతిలో చదువుకున్నా. అర్థం కానప్పుడు ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు సందేహాలని వృత్తి చేశారు. దీంతో ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. - ఎం.తేజవర్ధన్

ప్రణాళికతో చదివితే విజయం



పదో తరగతిలో ప్రణాళికబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాను. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి ప్రణాళిక రూపొందించుకున్నా. మార్కులు సాధించేందుకు తెలుగు, ఇంగ్లిషు కన్నా గణితం, సాంఘికశాస్త్రంలో ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంది. గతంలో ఇచ్చిన ప్రశ్నపత్రాలను ఒకసారి పునఃశ్చరణ చేసుకుంటే పరీక్షల్లో మంచి మార్కులు సాధించే అవకాశం ఉంది. - వై.రాగిణి

ఉపాధ్యాయుల కృషితో సాధన



ఉపాధ్యాయులు ఇచ్చే నోట్సు చక్కగా ఉపయోగపడింది. తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. మార్కెట్‌లో గైడ్లు చదవడం వలన పాస్ కావచ్చు కానీ మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉండదు. ఉపాధ్యాయులు బోధన బాగుండటం వలన ఆందోళన పడకుండా పరీక్షలు రాయడంతో మంచి మార్కులు సాధించాను. - డి.రాకేష్

పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పది విద్యార్థులపై మొదటి నుంచి ఫోకస్ చేస్తాం. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తాం. పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు విద్యాబోధనకు తోడ్పడుతున్నాయి. - రాజేంద్రప్రసాద్, హెచ్ఎం, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె

నిరుపయోగంగా మరుగుదొడ్లు



మార్కెట్‌యార్డులో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలోని మార్కెట్‌యార్డులో రైతుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. టమాటా మార్కెట్‌యార్డులో పదిహేను సంవత్సరాల క్రితం రూ.10 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించారు. యార్డులో మొత్తం 36 టమాటా మండీలు ఉన్నాయి. నిత్యం వేలాది మంది రైతులు ఇక్కడి మండీలకు టమాటాలు తీసుకొస్తుంటారు. దీంతో యార్డు పరిధిలో మరుగుదొడ్లు నిర్మించారు. ఇందుకోసం బోరువేసి మోటారు అమర్చి వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని రోజులుగా వీటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రైతులు అటువైపు వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు. మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగుచర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పరిశుభ్రతతో జబ్బులు దూరం

పీలేరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చని డాక్టర్ రమేష్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఏపీ బాలికల గురుకుల వసతి గృహంలో తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధికారులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసార, టైఫాయిడ్, కామెర్లు లాంటి వ్యాధుల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటి తాగాలని, ఈగలు వాలని, తాజా ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలపై దుమ్ము, దూలి పడకుండా, ఈగలు వాలకుండా మూతలు పెట్టాలని పేర్కొన్నారు. చేతు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం హెచ్ఈ కొండయ్య, ఫేమున్నిషా పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

ఉచిత విద్యుత్ కొనసాగించాలి

మదనపల్లె సిటీ : ఎస్సీ, ఎస్టీల ఇళ్లకు 200 యూనిట్ల ఉచితంగా విద్యుత్ అందించే పథకం యథావిధిగా కొనసాగించాలని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బాస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2013లో బాస్ చేపట్టిన నిరవధిక నిరాహారదీక్షతో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి దామోదరం రాజనరసింహ సానుకూలంగా స్పందించి ఈ పథకం అమల్లోకి తెచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారగానే కొత్త నిబంధనల పేరుతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్‌శాఖ అధికారులు ఎస్సీ, ఎస్టీలు విద్యుత్ బిల్లులు చెల్లించాలని వేధిస్తున్నారని ఆరోపించారు. ఉచిత గృహ విద్యుత్ పథకంపై ప్రభుత్వం ఇప్పటి వరకూ కొత్త మార్గదర్శకాలేమి ఇవ్వపోయినా, కొన్ని చోట్ల విద్యుత్‌శాఖ అధికారులు ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఉచిత విద్యుత్ పథకం అమలులో అధికారులు అవలంభిస్తున్న చర్యలపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి ఈ పథకం యథావిధిగా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బాస్ నాయకులు రెడ్డప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాస్ వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్

ఘనంగా తొలి ఏకాదశి పర్వదినం



పెద్దతిప్పసముద్రం : హోమం చేస్తున్న అర్చకులు



మదనపల్లె సిటీ : రుద్రహోమం చేస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం : స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ప్రతిమలకు అర్చకులు, వేద పండితులు మణికంఠ, శర్మ ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి పూజలతో పాటు వివిధ హోమాలు నిర్వహించారు. భక్తులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా తొలి ఏకాదశి

మదనపల్లె సిటీ : తొలి ఏకాదశిని పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలోని ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం, రుద్రహోమంను అర్చకులు విశ్వేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామిని రుద్రాభిషేకం చేశారు.



రామసముద్రంలో ప్రత్యేక అలంకారంలో లక్ష్మీజనార్ధనస్వామి

వైభవంగా ఏకాదశి పూజలు

రామసముద్రం : మండలంలో తొలి ఏకాదశి పురస్కరించుకుని బుధవారం విష్ణు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే చెంబకూరులోని గట్టు వెంకటరమణస్వామి, కోదండరామస్వామి, మినికిలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు విశేషంగా నిర్వహించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పీలేరు రూరల్ : గాండ్ల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ ఉపాధ్యా పెన్షనర్ల సంక్షేమ సంఘం (ఏజీటీయూపీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాలలో ఏజీటీయూపీఎస్ఎస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తమ యూనియన్ ద్వారా గాండ్ల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కుల ఆత్మగౌరవాన్ని పెంచుకుందామని పిలుపునిచ్చారు. సమైక్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సుగుణాకర్ (పీలేరు), జిల్లా అధ్యక్షుడిగా నారు శ్రీధర్ (రాయచోటి), ప్రధాన కార్యదర్శిగా రమణయ్య (పీలేరు), కోశాధికారిగా కిరణ్ (మదనపల్లె)తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శోలింగర్ గిరిశ్రీనివాస్, సీపీఎస్ సంఘ నాయకుడు పచ్చార్ల సుధాకర్, రెడ్డికృష్ణయ్య, కుమార్ తేజ, శేఖర్, చంద్రశేఖర్, వెంకటరమణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బీటీ కళాశాలకు పూర్వవైభవం తీసుకువస్తాం

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పట్టణంలో చారిత్రక నేపథ్యం కలిగిన బీటీ కళాశాలకు పూర్వవైభవం తీసుకువచ్చి, యూనివర్సిటీ చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రకటించారు. బుధవారం బెంగళూరు బస్టాండులోని ఎమ్మెల్యే కార్యాలయంలో బీటీ కళాశాల పార్ట్‌టైమ్ సిబ్బందికి ఉద్యోగ నియామకపత్రాలు వచ్చినందుకు కృతజ్ఞతగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేసినప్పటికీ, ఆస్తులు, సిబ్బంది, ఇతర విషయాల్లో పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదని విమర్శించారు. బీటీ కళాశాలలో పనిచేస్తున్న 32 మంది పార్ట్‌టైమ్ ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని కోరినప్పటికీ చేయకపోగా, మూడేళ్లుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారన్నారు. కళాశాలలో రద్దుచేసిన ఇంటర్మీడియట్, పీజీ కోర్సులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.గుర్రప్పనాయుడు, ఎస్.విద్యాసాగర్, రాటకొండనవీన్, నాదెళ్ల శివ, ఇంతియాజ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు

వాల్మీకిపురం : పట్టణంలోని ఇరానీ కాలనీలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పీర్లను ప్రత్యేకంగా అలంకరించి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం జల్ది కార్యక్రమం నిర్వహించారు.

ముగిసిన మొహర్రం ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామ పుర వీధుల్లో పీర్లను ఊరేగించారు. కుల, మతాలకు అతీతంగా భక్తులు హాజరై మొక్కుబడులు చెల్లించుకుని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

20 నుంచి పీర్ల పండుగ ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం మండలంలోని తుమ్మరకుంట పంచాయతిలో ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు పీర్ల పండుగ ఉత్సవాలు నిర్వహిస్తామని గ్రామస్థులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలోని అన్ని గ్రామాల్లో పీర్ల ఊరేగింపుతో పాటు జల్ది, అన్నదాన కార్యక్రమం, మూన్నాళ్ల శాస్తం కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పీర్ల ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా మొహర్రం వేడుకలు

మదనపల్లె సిటీ: మొహర్రం వేడుకలు బుధవారం హిందూ, ముస్లింలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక నెహ్రూ బజార్‌లోని తాటిమాన్ల మకాన్ పీర్లకు ప్రత్యేక అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. బొరుగులు, బెల్లం, చెక్కర చదివింపులు చేశారు. పలువురు భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. పీర్లను ఊరేగింపుగా కొత్తపల్లి వద్ద ఉన్న దిగుడు బావి వద్దకు తీసుకెళ్లి జలధోత్సవం చేశారు. స్థానిక పెద్ద మసీదు వద్ద నున్న పపాయ్ మకాన్ వద్ద పీర్లను భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. మదనపల్లె మండలం పోతబోలులో మొహర్రం పురస్కరించుకుని పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

కేవీపల్లె : మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని కేవీపల్లె, గుఱ్రెడ్డిగారిపల్లె, గర్నిమిట్ట, లక్ష్మీరెడ్డిగారిపల్లె, తిమ్మాపురం, గోరంట్లపల్లె, చీనేపల్లె, నూతనకాల్వ, మారేళ్ల తదితర గ్రామాల్లో మొహర్రం పండుగ చేసుకున్నారు. గ్రామాల్లోని పీర్ల చావిడిలో పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పీర్లను వైభవంగా ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు హిందూ, ముస్లింలు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

రామసముద్రం : మండలంలోని తిరుమలరెడ్డిపల్లె, దిగువపేట, ఆర్.నడింపల్లి, ఎగువపేటలో పదిరోజులుగా వైభవంగా నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలు బుధవారంతో ముగిశాయి. బుధవారం వేకువజామున హస్సేన్ బాబయ్యకు, గంధం పీర్లకు హిందూ, ముస్లింలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కుల మతాలకతీతంగా నాలుగు గ్రామాల పీర్ల బాబయ్యలను బజారువీధి మీదుగా ఊరేగిస్తూ దిగువపేటలో ఉన్న మైదానంలోకి వెళ్లి ములాకత్ చేశారు. ఈ వేడుకలు తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెడ్డివారి వంశీయులు పూజలు చేయగా.. అనంతరం చింతకుంట కుటుంబం, సందూరి వంశస్తులు పూజలు చేశారు. సింగనమల సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



పెద్దతిప్పసముద్రం : పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



రామసముద్రంలో పీర్ల బాబయ్యకు ములాకత్ చేస్తున్న భక్తులు



మదనపల్లె సిటీ: పీర్లను పూలతో అలంకరించిన దృశ్యం



కేవీపల్లెలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



కందుకూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

24 నుంచి గంగమ్మ జాతర

సిద్దవటం : మండలంలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి 21వ జాతర మహోత్సవ కార్యక్రమం ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని దేవస్థానం కమిటీ వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శీతల గంగమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఆలయాన్ని రంగులతో అలంకరించి తిరునాలకు ముస్తాబు చేశారు. ఈనెల 24వ తేదీన అమ్మవారికి పాలాభిషేకం, అలంకరణ, పొంగళ్లు, శక్తి పూజ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదే రోజు రాత్రి అమ్మవారి కథ, అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా ఆలయానికి చేరుస్తామన్నారు. 25వ తేదీన గంగమ్మకు అభిషేకం, అలంకరణ, అమ్మవారి దర్శనం, పొంగళ్లు, నైవేద్యం వంటి పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. గ్రామ పొలిమేరలో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేస్తారని కమిటీ వారు తెలియజేశారు. జాతరలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని పేర్కొన్నారు.

బాలుర బీసీ గురుకులం నిర్మించాలి

నందలూరు : మండలంలో బీసీ బాలుర గురుకుల పాఠశాలను నిర్మించాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్ బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కోరారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మంత్రికి వినతి పత్రం సమర్పించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో అధిక సంఖ్యలో బీసీ విద్యార్థులు ఉన్నారని వారికి అనుగుణంగా నందలూరు మండలంలో బీసీ గురుకుల పాఠశాలను నిర్మించాలని కోరానన్నారు. నందలూరులో అన్ని వసతులు, ప్రభుత్వ స్థలం, మంచి వాతావరణం, స్వచ్ఛమైన నీరు అన్నింటికీ అనువుగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.